## కొనసాగుతున్న సమ్మె



మారుపెట్టి యాకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. జనగామ జిల్లా ఎంఈవో కార్యాలయ మెసెంజర్ మారుపెల్లి యాకయ్య అకాల మరణానికి ప్రభుత్వమే కారణమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, హరిప్రియ, కాళీదాస్, శైలజ, వనజ, గంగ ప్రసాద్, దినేశ్, లక్ష్మణ్, శంకర్, కృష్ణ, నవీన్, లింగం, రాజు పాల్గొన్నారు.

## వ్యక్తి బైండోవర్

మాచారెడ్డి, డిసెంబర్ 14 : మండలంలోని మైసమ్మ చెరువుతండాకు చెందిన బానోత్ రమేశ్ మద్యం మత్తులో 'డయల్ 100'కు ఫోన్ చేశాడు. రమేశ్‌ను శనివారం తహసీల్దార్ శ్వేత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మద్యం మత్తులో ఫోన్ చేసి విధులకు ఆటంకం కలిగించి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు మొదటి తప్పుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్సై సూచించారు.

## నర్సరీ పనుల పరిశీలన



నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్

బీబీపేట్, డిసెంబర్ 14 : మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీలో పనులను ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ శనివారం పరిశీలించారు. బ్యాగ్ ఫిల్లింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శి రమేశ్‌కు సూచించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల పాఠశాలలో నూతన మెనూను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్



ఉప్పల్‌వాయి గురుకుల వసతిగృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 14 : జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం సందర్శించి కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో గిరిజన గురుకుల పాఠశాలలను అధికారులు సందర్శించారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ట్రైబల్ గురుకుల అసిస్టెంట్ సెక్రటరీ సూర్యప్రకాశ్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బీర్కూర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను ప్రత్యేకాధికారి శేఖర్ సందర్శించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అధ్యాపకులకు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి నూతన మెనూ చార్టును విడుదల చేశారు. ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు శాంతికుమార్, సరిత, సవిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలం బోర్లం మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ చార్టులను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, నాయకులు సురేశ్ గుప్తా, ఎజాస్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, పర్వంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులోని బీసీ హాస్టల్‌లో విద్యార్థుల డైట్ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ సునీత, ఈవో మహేశ్‌గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బీబీపేటలోని ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. ఎల్లారెడ్డిలోని మైనారిటీ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ విక్టర్ సందర్శించారు. నూతన మెనూను ప్రారంభించారు. కిచెన్, డార్మెటరీ, తరగతి గదులు, మరుగుదొడ్లు, వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆర్డీవో, మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల, బీసీ బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహం, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను ఎంఈవో వెంకటేశం, ఎంపీడీవో ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, ఎస్సీ బాలుర వసతిగృహాన్ని వెంకటేశ్వర్‌రావు సందర్శించారు.

రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల కళాశాలలో కామన్ డైట్ మెనూను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్ వద్ద జ్యోతిబాపూలే మహిళా వసతి గృహాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో సురేందర్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో నూతన మెనూపై ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి రత్నం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, వార్డెన్ రాములు, సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు. లింగంపేటలోని ప్రభుత్వ గురుకుల సంక్షేమ వసతి గృహాలను అధికారులు నూతన డైట్ మెనూ ప్రారంభోత్సవం సందర్భంగా సందర్శించారు. మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తహసీల్దార్ నరేందర్ గౌడ్, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను ఎంపీడీవో నరేశ్, బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపీవో మల్లారీ, బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంఈవో షౌకత్ అలీ, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహాన్ని తాడ్వాయి తహసీల్దార్ రహీముద్దీన్ సందర్శించారు. తాడ్వాయిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా సీఈవో, తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి రాజారాం సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. భిక్కనూరు మండలం జంగంపల్లి ఎంజేపీ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన డైట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ ప్రసాద్ ఎంజేపీ సిబ్బంది పాల్గొన్నారు.



బోర్లంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



భిక్కనూరు మండలం జంగంపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

## ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ



స్నానపు గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. ఏవైనా సమస్యలు ఉన్నాయా.. అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోకి బయటి వ్యక్తులు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బయటి వ్యక్తులు లోపలికి రాకుండా చూడాలని హాస్టల్ వార్డెన్ రాజేశ్, పోలీసులకు కలెక్టర్ సూచించారు. ఆయనవెంట మండల ప్రత్యేక అధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల ప్రారంభం



ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలను ప్రారంభిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 35వ వార్డులో దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

**రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి**

మాచారెడ్డి, డిసెంబర్ 14 : రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి అన్నారు. శనివారం పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో గ్రోమోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సంబురాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పోసు అనిల్, వెంకట్‌రెడ్డి, నర్సింహాచారి, సురేశ్, నరేశ్, నారాయణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన కుర్మలు



బాన్సువాడలోని పోచారం స్వగృహం నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 14 : హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో ఐదు ఎకరాల స్థలంలో నిర్మించిన కుర్మ ఆత్మ గౌరవ దొడ్డి కొమురయ్య భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బాన్సువాడలోని పోచారం స్వగృహం నుంచి కుర్మలు శనివారం తరలివెళ్లారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, కుర్మ సంఘం ప్రతినిధులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కుర్మ సంఘం ప్రతినిధులు గంగారాం, పర్వగౌండ, సాయినాథ్, రమేశ్, సాయిగౌండ, బీరప్ప, వినోద్, శేఖర్, విఠల్ పాల్గొన్నారు.

## కాలువలో బెడ్ వేయించిన అధికారులు



కాలువలో వేసిన బెడ్

లింగంపేట, డిసెంబర్14: మండల కేంద్రంలో మత్తడి కాలువ నుంచి రెండు కుంటల్లోకి సాగునీటి సరఫరా చేసే కాలువలో నీటి పారుదల శాఖ అధికారులు బెడ్ వేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శనివారం 'బురదలో సైడ్‌వాల్ నిర్మాణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. సైడ్‌వాల్ నిర్మాణం చేసిన ప్రాంతంలో బెడ్ వేయించడంతో పాటు బురదలో సైడ్‌వాల్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించారు. ఆదివారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించిన అనంతరం నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## అనాథలకు దుప్పట్ల పంపిణీ



ఎల్లారెడ్డిలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కుర్మ సాయిబాబా

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: భిక్షాటన చేసి రోడ్డుపక్కన నిద్రిస్తున్న అనాథలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా శుక్రవారం రాత్రి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు దుప్పట్ల పంపిణీ ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు సంతోష్‌నాయక్, నగేశ్‌నాయక్, నాగం శ్రీనివాస్, సంగ్రామ్‌నాయక్, శంకర్, సృజన్‌గౌడ్, సర్దార్, ప్రకాశ్ తదితరులున్నారు.

# జీతాలు పెంచాలని వినతి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: పెరిగిన ధరల ప్రకారం తమ జీతాలను పెంచాలని మైనారిటీ గురుకుల పాఠశాల బోధనేతర సిబ్బంది అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విక్టర్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది పీసీఈ, హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, హెడ్‌కుక్, హెల్పర్స్, స్కావెంజర్లు ఎనిమిదేండ్లుగా పాఠశాలలో పనిచేస్తున్నామని, అప్పటి నుంచి ఇప్పటివరకు జీతాలు ఏమాత్రం పెంచలేదని, అదే జీతంతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా జీతాలు పెంచి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిబ్బంది మాధవి, భాగ్య, షఫీ, గంగారాం తదితరులున్నారు.



అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాల బోధనేతర సిబ్బంది

# జాతీయ లోక్ అదాలత్‌లో 1003 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న పోలీసులు, న్యాయవాదులు

ఎల్లారెడ్డి, రూరల్ డిసెంబర్ 14: మూడు రోజులుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1003 కేసులు పరిష్కరించినట్లు సివిల్ కోర్టు జడ్జి హారిక శనివారం తెలిపారు. లోక్ అదాలత్‌లో 81 క్రిమినల్ కేసులు, నాలుగు కుటుంబ తగాదాలు, 11సైబర్ నేరాలు, 903 పిటి కేసులు, ఎక్సైజ్ శాఖకు సంబంధించి నాలుగు కేసులు పరిష్కారం అయినట్లు జడ్జి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సీఐ రవీందర్‌నాయక్, ఎక్సైజ్ సీఐ శాఖీర్, ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్, న్యాయవాదులు నామ శ్రీకాంత్, గోపాల్‌రావు, పండరి, సాయిబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బంధు నిధులు విడుదల చేయాలి

నాగిరెడ్డిపేట, డిసెంబర్14: రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు వెంటనే జమ చేయాలని మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అట్టకెక్కాయన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ 50 శాతం కూడా మాఫీ కాలేదన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోనే 2,500 మంది రైతులకు రుణమాఫీ రాలేదన్నారు. బ్యాంకర్లు, సొసైటీలు చేసిన తప్పులకు ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. గతంలో మాదిరిగానే, నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## గ్రామ సుభిక్షం కోసం.. గ్రామస్తుల పాదయాత్ర



మాల్తుమ్మెద గ్రామం నుంచి దైవదర్శనాలకు కాలినడకన వెళ్తున్న భక్తులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 14: గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ.. మండలంలోని మాల్తుమ్మెద గ్రామస్తులు ప్రతి యేట కాలినడకన ఒకే రోజు దైవదర్శనాలు చేసుకుంటారు. శనివారం గ్రామంలోని వేంకటేశ్వరాలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి గ్రామంలోని చెన్న కేశ్వరాలయంలో పూజలు చేసి హరినామ స్మరణ చేస్తూ, సంకీర్తనలతో పాద యాత్రగా మెదక్ జిల్లాలోని జన్కన్నపేట లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకొన్నారు. అక్కడి నుంచి కూచన్‌పల్లి కూచాద్రి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడి నుంచి మత్తాయికోట సిద్ధిరామేశ్వరాయలం చేరుకొని ప్రత్యేకాభిషేకాలు చేశారు. తిరిగి కాలినడకన స్వగ్రామానికి చేరుకుంటామని గ్రామస్తుడు బారాది నరేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయికోటి రాములు, కర్రె పెంటయ్య, చాకలి రాములు, చాకలి ఏసులు, బైండ్ల మోహన్‌తో పాటు మరో 150 మంది గ్రామస్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వైద్యులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14: జిల్లా కేంద్రంలోని నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఫెస్ట్‌లో భాగంగా శనివారం వైద్యులకు 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపందెం, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ పోలీస్‌కమిషనర్ రాజా వెంకట్‌రెడ్డి, గౌరవ అతిథి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ తోట కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. అధిక సంఖ్యలో వైద్యులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఫుట్‌బాల్, చెస్, క్యారం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, సైక్లింగ్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి, ఆకుల విశాల్, హరీశస్వామి, శ్రీధర్‌రావు, అర్చన, రాజేంద్ర ప్రసాద్, రాజేందర్, రషీద్‌అలీ, ఫరీదాబేగం, నాగార్జున, దీపక్‌రాథోడ్, దామోదర్‌రావు, జీవన్‌రావు, వినోద్‌కుమార్‌గుప్తా, రాజేశ్, చంద్రశేకర్‌రావు, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు సన్మానం




అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్

వినాయక్‌నగర్, డిసెంబర్ 14: తెలంగాణ ఉర్దూ అకాడమీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న ఇద్దరిని నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. తెలంగాణ వర్సిటీ ప్రొఫెసర్ అబ్దుల్ ఖని,ఉర్దూ జర్నలిస్ట్ మహమ్మద్ అలీ ఖాన్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ వారికి పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు,బార్ సభ్యులు వసంత్ రావు, వెంకటరమణ గౌడ్, జైపాల్, యూనిస్ ఖాన్, సంతోష్, నాగ్ రవిబాబు, శ్రీనివాస్, సురేశ్, మంజిత్ సింగ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

**PLOT FOR SALE**
★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-327118

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.